డీఎస్సీలో మెరిసిన ఆణిముత్యాలు




రాయి సాయికోటి


మైలారి శ్రీకాంత్

● రెండు విభాగాల్లో ఇద్దరికి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు

చిట్టమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యర్థులు మెరిశారు. ఒక్కొక్కరు నాలుగైదు పోస్టులకూ ఎంపికయ్యారు. రెండు విభాగాల్లో.. ఇద్దరు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించారు. ఆ ఇద్దరూ చిట్టమూరు మండలానికి చెందిన వారే కావడం గమనార్హం. కోగిలి గొల్లపాలెంకు చెందిన రాయి సాయి కోటి యాదవ్ ఎస్ఏ పీఈటీ విభాగంలో 93 మార్కులతో.. ఎల్లసిరి దళితవాడకు చెందిన మైలారి శ్రీకాంత్ ఎస్ఏ తెలుగులో 91 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. వీరిలో సాయికోటి తల్లిదండ్రులు కృష్ణయ్య, సుజాత వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని లక్ష్యం పెట్టుకుని కష్టపడి చదివారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగానే.. తన లక్ష్యాన్ని చేరుకున్నారు.

● ఇక, మైలారి పెంచలయ్య, రత్నమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్ కూడా వసతి గృహంలో ఉండి.. ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఉపాధ్యాయ వృత్తి సాధించాలనే సంకల్పంతో తల్లిదండ్రుల కష్టం తెలిసిన తనయుడుగా బాగా చదివారు. డిగ్రీ వరకు మంచి మార్కులు సాధించారు. డీఎస్సీలో ఎస్ఏ తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకుతో తన కల నెరవేర్చుకున్నారు.

ఒకేసారి ఐదు టీచర్ పోస్టులకు..

● ప్రతిభ చాటిన వ్యవసాయ కూలీ బిడ్డ


శేషాద్రికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం రావడమే గగనమవుతున్న రోజుల్లో ఆ వ్యవసాయ కూలీ బిడ్డ ఏకంగా ఐదు విభాగాల్లో పోస్టులు సాధించారు. విశేష ప్రతిభాపాటవాలతో పోటీ అభ్యర్థులకు స్ఫూర్తిని, కుటుంబసభ్యుల్లో ఆనందాన్ని నింపారు శేషాద్రి. ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద పరిధిలోని ఓఎస్ గొల్లపల్లెకు చెందిన ముండ్రే చిన్న వెంకటరమణ, రమణమ్మ దంపతులు ఉన్న కొద్ది పాటి పొలం సాగుతో పాటు వ్యసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమారుడు శేషాద్రిని కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల శ్రమకు తగినట్లుగా అతడూ కష్టపడి చదివారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ- 2025 పరీక్షలకు అకుంఠిత దీక్షతో సిద్ధమయ్యారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 80.63 మార్కులతో 9వ ర్యాంకు, 86.33 మార్కులతో సెకండరీ గ్రేడ్ విభాగంలో 53వ ర్యాంకు, టీజీటీ- ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచరు (తెలుగు)లో 127వ ర్యాంక్, టీజీటీ (సోషల్)లో 82వ ర్యాంక్, ఎస్ఏ(తెలుగు)లో 42వ ర్యాంక్‌లు సాధించాడు. ఒకే పర్యాయం ఐదు విభాగాల్లో ర్యాంకులు సాధించి పోస్టులకు ఎంపిక కావడంతో శేషాద్రి కుటుంబంలో ఆనందానికి హద్దు లేకుండా పోయింది.

● ఇదే మండలంలోని బొగ్గలవారిపల్లెకు చెందిన కామసాని శ్యామల రెడ్డెప్పరెడ్డిల కుమారుడు శివకుమార్‌రెడ్డి కూడా ఎస్ఏ స్పెషల్ విభాగంలో 128వ ర్యాంక్, ఎస్‌జీటీలో 270వ ర్యాంక్ సాధించడం విశేషం.

సరస్వతీ పుత్రుడు మోహన్

● మెగా డీఎస్సీలో నాలుగు పోస్టులకు అర్హత
● అంతకుముందు కానిస్టేబుల్ పరీక్షలో మూడో ర్యాంకు

తిరుపతి(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల ప్రాయంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు. ఉపాధి నిమిత్తం తల్లి కువైట్‌కు వెళ్లారు. అమ్మమ్మ ఇంటి వద్దే పెరిగాడు. తాజాగా మెగా డీఎస్సీలో ఆ కుర్రాడు విశేష ప్రతిభ చాటి నాలుగు పోస్టులకు అర్హత సాధించాడు. పుత్తూరుకు చెందిన గజేంద్ర, రత్న దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో మోహన్ చిన్నవారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుసాగింది. దూర విద్యావిధానంలో బీఏ, బీఈడీ పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడంతో పట్టుదలతో సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 23, తెలుగు విభాగంలో 27, ఎస్జీటీలో 26, టీజీటీ(సోషల్)లో 35వ ర్యాంకులను పొందారు. అంతేకాదు ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఏకంగా జిల్లాలో 3వ ర్యాంకు సాధించాడీ ప్రతిభావంతుడు. తమ వద్ద శిక్షణ పొందిన మోహన్‌ను హేమశ్రీ డీఎస్సీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాసులు అభినందించారు.


మోహన్‌ను అభినందిస్తున్న శ్రీనివాసులు

డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత


సాయినాథ్, వనజ

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో ఇద్దరు డీఎస్సీ అభ్యర్థులు మూడు పోస్టులకు అర్హత సాధించారు. తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన కావలి నరసయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు సాయినాథ్ నెల్లూరు జిల్లాస్థాయిలో స్కూల్ అసిస్టెంట్(సోషల్) 23వ ర్యాంక్ సాధించారు. అదే విధంగా టీజీటీ జోన్ 3లో (సోషల్) 59వ ర్యాంక్, పీజీటీ(గురుకులంలో సోషల్) జోన్-3లో 22వ ర్యాంక్ సాధించాడు. ● చిట్టేడుకు చెందిన వెంకటరమణయ్య, సునీత దంపతులు కుమార్తె వనజ డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత సాధించింది. ఎస్జీటీలో జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు, గణితంలో స్కూల్ అసిస్టెంట్ 16వ ర్యాంకు, టీజీటీలో 57వ ర్యాంకు సాధించారు.

స్మార్ట్‌గా.. రేషన్ కార్డులు

● జిల్లాలో రేపటి నుంచి 6,36,196 కార్డుల పంపిణీ



రేషన్ కార్డు స్మార్టుగా మారింది. ఏటీఎం సైజ్‌కు తగ్గింది. జేబులోను, పర్సులోను దీనిని పెట్టుకొని వెళ్లొచ్చు. గుర్తింపు కార్డు కింద వాడుకోవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావడంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఈ స్మార్టు కార్డులు తీసుకొచ్చింది. సోమవారం నుంచి వీటి పంపిణీకి చర్యలు చేపట్టింది. జిల్లాకు కొత్తగా 44,937 రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఇప్పటికే దాదాపు 5,91,259 బియ్యం కార్డులున్నాయి. ఈ మొత్తం కలుపుకుని 6,36,196 స్మార్ట్ కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి రోజు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డు మాత్రమే ప్రామాణికంగా వుండనుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా వివాహమైన దంపతులు, కుటుంబాల నుంచి విడిపోయిన వారికి మళ్లీ కార్డులు తీసుకోవడానికి అవకాశం లేకుండా ఐదేళ్ల పాటు ఆందోళన చెందారు. వాటి నుంచి కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. దీనికోసం ఈ ఏడాది మే 7 నుంచి అన్ని సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో దాదాపు 63,589 మంది దరఖాస్తు చేయగా వివిధ ప్రాతిపదికన పరిశీలించి ఇప్పటి వరకు 44,937 మందిని అర్హులుగా గుర్తించి వారికి మాత్రం ఇప్పుడు కొత్తగా కార్డులు పంపిణీ చేయనున్నారు.

స్మార్టు కార్డు ఇలా.. : స్మార్టు కార్డులో నేతల ఫొటోలు ఉండవు. కార్డుకు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, ఆ రేషన్ కార్డు నెంబరు, రేషన్ షాపు ఐడీ నెంబరు తదితర వివరాలతో పాటు క్యూఆర్ కోడ్ ఉంటుంది. కార్డు వెనుకవైపున లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. ఈ కార్డుపైనున్న క్యూఆర్ కోడ్‌ను, డీలర్ల వద్దనున్న ఈ పోస్ యంత్రంతో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలు డిస్‌ప్లే అవుతాయి. రేషన్ సరుకుల వినియోగ సమాచారమూ కనిపిస్తుంది. ఇలా సరికొత్త టెక్నాలజీతో స్మార్టు కార్డును ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఇది నిరంతర ప్రక్రియ

ఇప్పుడు కార్డుల కోసం దరఖాస్తు చేసి రాని వారు, కొత్తగా కార్డులు కావాలని దరఖాస్తు చేసుకోవాలన్నా ఇది నిరంతర ప్రక్రియనే. వాట్సాప్ నెంబరు 95523 00009 నెంబరులో బియ్యం కార్డులు సరెండర్, చేర్పులు, తొలగింపులు, తప్పులు సరిచేయడం, నూతన కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చును. వివాహ ధ్రువీకరణ పత్రం, పెళ్లి ఫొటో కూడా అవసరం లేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసిన 21 రోజుల్లో రేషన్ కార్డు అందుతుంది.

- శేషాచలం రాజు, డీఎస్‌వో

ఐఐటీ వద్ద స్పేస్ సిటీ

● 15 ఎకరాలు గుర్తించిన అధికారులు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఏరో స్పేస్ సిటీ ఏర్పేడు సమీపంలో రూపుదిద్దుకోనుంది. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్‌కీ, శ్రీసిటీ సెజ్‌కీ సమీపంలో ఉండేలా ఐఐటీ వద్ద 15 ఎకరాల భూమిని అధికారులు ఇందుకోసం గుర్తించారు. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు అయిన డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఇందుకు సంబంధించిన పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇటీవల ఆయన జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఆయన సూచన మేరకే ఐఐటీ వద్ద భూములను జిల్లా కలెక్టర్ గుర్తించారు. త్వరలోనే దాన్ని డీఆర్‌డీవోకు అప్పగించనున్నారు. డీఆర్‌డీవోకి అనుబంధంగా ఏర్పాటు కానున్న స్పేస్ సిటీలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్పత్తి కార్యకలాపాలన్నీ షార్ సమీపంలో జరుగుతాయని తెలుస్తోంది.

అవిలాలలో పర్యాటక శాఖకు పది ఎకరాలు

ఇక తిరుపతి రూరల్ మండలం అవిలాల రెవిన్యూ గ్రామ పరిధిలో అత్యంత విలువైన పది ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖకు కేటాయించింది. డీకేటీ పట్టాల పేరిట ఇతరుల అనుభవంలో ఉన్న ఈ భూములను స్వాధీనం చేసుకుని ఏపీ టూరిజం అథారిటీకి అప్పగించింది. పర్యాటక శాఖ ఆ భూమిని అభివృద్ధి చేసి ఆతిథ్య రంగానికి సంబంధించి ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్ లేదా రిసార్టులకు కేటాయించనుంది. అలాగే దామినీడు పరిధిలో స్వాధీనం చేసుకున్న భూముల్లో 28 ఎకరాలను పర్యాటక శాఖకు, 34 ఎకరాలను స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణానికి, 14 ఎకరాలను జిల్లా కోర్టు భవనాల సముదాయానికి కేటాయించారు. పర్యాటక శాఖకు కేటాయించిన భూముల్లో రెండు ఫైవ్ స్టార్ హోటళ్లు రానున్నాయి.

సెమీ కండక్టర్ పరిశ్రమ మనకేనా?

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన సెమీ కండక్టర్ పరిశ్రమకు తిరుపతి జిల్లానే అనువైనదని భావిస్తున్నట్లు తెలిసింది. కొప్పర్తి, ఓర్వకల్లు, తిరుపతిలలో ఒక చోట దీనిని ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. అయితే ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, సంబంధిత పరిశ్రమలున్న తిరుపతి జిల్లానే ఎక్కువ అనువైనదని అంటున్నారు. తిరుపతి జిల్లాకు చెన్నై, బెంగుళూరు నగరాలు చేరువగా వుండడం కూడా అనుకూలాంశం. తిరుపతి జిల్లాను ఎంపిక చేస్తే అప్పగించడానికి వీలుగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద 600 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం గుర్తించినట్టు తెలిసింది. జిల్లాకు ఈ యూనిట్ వస్తే యువతకు ఉపాధి అవకాశాలు సైతం గణనీయంగా మెరుగుపడతాయి. జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోంది.


కుప్పం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

బాలునాయక్ ఆస్తులు భారీనే!

● రెండు రోజులపాటు ఏసీబీ సోదాలు
● కార్మిక శాఖ జాయింట్ కమిషనరు అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్మికశాఖ జాయింట్ కమిషనరు బాలు నాయక్ ఆస్తులు భారీగానే ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించి శనివారం ఆయన్ను అరెస్టు చేశారు. బాలు నాయక్‌పై కొంతకాలంగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. కర్నూలులోని కార్మిక శాఖ కార్యాలయంతో పాటు అద్దె ఇల్లు, తిరుపతిలో రెండు చోట్ల, అన్నమయ్య జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో.. ఇలా మూడు జిల్లాల పరిధిలో 11 చోట్ల ఏకకాలంలో సోదాలు జరిగాయి. తిరుపతి నగరం రాఘవేంద్ర నగర్‌లో దాదాపు మూడు అంతస్తుల ఇల్లు, కుమారుడి పేరిట సర్జికల్ దుకాణం ఉంది. రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఇంటి ప్లాటు ఉన్నట్లు రికార్డుల ద్వారా ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇక కర్నూలులో భార్య పేరు మీద ప్లాటు, వ్యవసాయ భూములు ఉన్నాయని గుర్తించినట్ల తెలిసింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లిలో బాలు నాయక్ కుటుంబ సభ్యుల పేర్లమీద 10 ఎకరాల పొలాలు ఉన్నట్లు తనిఖీల్లో వెలుగు చూసినట్లు సమాచారం. సంబేపల్లిలో ఒక పౌల్ట్రీ ఫారం ఉంది. తిరుపతిలో ఇంటి స్థలం ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.ఐదారు కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మార్కెట్ విలువ ప్రకారం రూ.50 కోట్లు ఉండొచ్చని అంచనా. వీటితో పాటు పలు చోట్ల బినామీ పేర్ల మీద ఆస్తులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక, అర కిలో బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు లాకర్లను పరిశీలించేందుకు మేనేజర్లకు లేఖలు రాశారు. శనివారం బాలు నాయక్‌ను అరెస్టు చేసి నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు తరలించారు.

వి.కోటకు చేరుకున్న నీళ్లు

వి.కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం వి.కోటకు శనివారం హంద్రీ-నీవా జలాలు చేరుకున్నాయి. ఉదయాన్నే బైరెడ్డిపల్లె మండలం నుంచి కృష్ణాజలాలు తోటకనుమ మీదుగా గ్రావిటీ ద్వారా దానమయ్యగారిపల్లె వద్దకు చేరుకున్నాయి. మధ్యాహ్నం కృష్ణాపురం వద్దనున్న పంప్ హౌస్‌కు జలాలు రావడంతో పెద్ద ఎత్తున జనం అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం పంప్ హౌస్‌లో మిషన్లకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నేతలు, కూటమి నాయకులు పూజలు చేశారు. పంప్ హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ చేసి నీరు పంపింగ్ చేశారు. కాసేపటికే నీరు రెండు పైపుల నుంచి బయటకు రావడంతో ఒక్కసారిగా రైతులు, పార్టీ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో 600 కిలోమీటర్లు మేర కాలువ నిర్మాణం పూర్తి చేసి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా 700 అడుగుల ఎత్తుకు నీటిని తరలించడం చారిత్రాత్మకం అన్నారు. సాయంత్రానికి వి.కోట - కుప్పం మార్గంలోని దాసార్లపల్లె వద్ద జాతీయ రహదారిని దాటి కృష్ణా జలాలు కుప్పం వైపు పరవళ్లు తొక్కాయి. రాత్రికి పెద్దబరిణేపల్లె పంచాయతీ ఆదినేపల్లె వద్దనున్న మరో పంప్ హౌస్‌కు నీరు చేరుకోనున్నాయి. అక్కడ నీటిని పంప్ చేస్తే కుప్పం సెగ్మెంట్ పరిధిలోని రామకుప్పం మండలంలోకి అడుగెడుతాయి. ఇందుకుగాను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కాలువ వెంబడి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు.

30న సీఎం చంద్రబాబు జలహారతి

కుప్పం, ఆంధ్రజ్యోతి: కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు ఆదివారం రాత్రికి కృష్ణా జలాలు చేరవచ్చని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. ఈ చెరువు వద్ద సీఎం చంద్రబాబు నాయుడు 30వ తేదీన హంద్రీ-నీవా కాలువకు జలహారతి ఇవ్వనున్నారు. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద జూలై 17న కృష్ణా జలాలను చంద్రబాబు హంద్రీ-నీవా కాలువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. శనివారం నాటికి వి.కోట మండల పరిధిలోకి వచ్చేశాయి. ప్రస్తుతం కాల్వలో 80 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇదే వేగంతో సాగితే ఆదివారం రాత్రికల్లా కుప్పం మండలంలోకి వస్తాయి.

వైకల్యాన్ని ఓడించాడు
● ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్
● క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం
6

లాటరీ నిర్వహించని దుకాణాల దరఖాస్తు రుసుం వాపస్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు రాకుంటే వాటికి లాటరీ నిర్వహించేది లేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. అటువంటి బార్లకు సంబంధించి దరఖాస్తు రుసుంను వెనక్కి ఇచ్చేస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-28 సంవత్సరాలకు సంబంధించి కొత్త బార్ పాలసీ ప్రకటించిన తరుణంలో జిల్లా వ్యాప్తంగా 29 బార్లు, గీతకులాల కోసం ప్రత్యేకంగా మరో మూడు బార్లు కేటాయిస్తున్నారన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ 5 లక్షలు దరఖాస్తు రుసుం, ప్రాసెసింగ్ ఫీజు కింద అదనంగా రూ 10,000 సమర్పించాలన్నారు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు అందితేనే లాటరీ తీస్తామన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



మొగరాల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీచర్లు,విద్యార్థులు

పాకాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు ఆధ్వర్యంలో రాకెట్ నమూనాలపై విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిత్రలేఖనం, అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇస్రో శాస్త్రవేత్తల మేధస్సు, కృషి విజయాలను ఉపాధ్యాయులు కొనియాడారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఆదికేశవులు నాయుడు, ఉపాధ్యాయులు సుల్తాన్, బాబునాయుడు, రామమూర్తి, ప్రమోదిని, విమల విక్టోరియా, నీరజ, శైలజ, మోహన్ రావు, హరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ



భాకరాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

భాకరాపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేటలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి పొడి చెత్త వేర్వేరుగా అందించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన, డ్రైనేజ్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నివాస పరిసరాల్లో చెత్త నిల్వలు పెరిగితే అనారోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, ఏపీఎం స్వర్ణలత, సర్వేయర్ గణేశ్, కార్యదర్శి వెంకటేశులు పాల్గొన్నారు.

చంద్రగిరి: పిచ్చినాయుడుపల్లి పంచాయతీలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ హరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు రాజేష్, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటా ప్రచారం చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ. గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థుల తాగునీటి కష్టాలు



తాగునీటి క్యాను తెస్తున్న విద్యార్థులు

చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తాగునీటికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి వాటర్ ప్యూరిఫైయర్ చాలా రోజులుగా పని చేయడంలేదు. విద్యార్థులు శుద్ధనీరు బయట నుంచి తెచ్చుకుంటున్నారు. కొంతమంది విద్యార్థులు బోర్ నీరు తాగుతున్నారని దాని వలన అనారోగ్యానికి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. తల్లికి వందనం కింద కళాశాల అభివృద్ధికి కేటాయించిన నగదు తీసుకుని తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

వకుళమాత అమ్మవారికి సారె సమర్పణ



పట్టువస్త్రాల సారెని తీసుకొస్తున్న భక్తులు

తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): పేరూరుబండపై వెలసిన వకుళమాత అమ్మవారికి తిరుపతి నగర సంకీర్తన మండలి ఆధ్వర్యంలో శనివారం పట్టువస్త్రాల సారె సమర్పించారు. శ్రావణ మాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి నేతృత్వంలో పలువురు సభ్యులు, మహిళలు పసుపు, కుంకుమ, పండ్లు, పట్టువస్త్రాలతో కూడిన సారెని సమర్పించి మొక్కు చెల్లించారు. చిగోరా ఆధ్యాత్మికకేంద్రం వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు, పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, నగర సంకీర్తనమండలి సభ్యులు వాసుదేవరెడ్డి, విగ్రహాల కళ్యాణి, పద్మావతి, భాగవతుల జయలక్ష్మి, లక్ష్మీరంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వారాహి, భైరవ, కాళీ హోమాలు



రామచంద్రాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం సందర్భంగా రాయలచెరువు కట్ట శక్తిపీఠంలో వారాహి, భైరవ కాళీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరకతశక్తికాళీ అమ్మవారితో పాటు ప్రత్యుంజర, వారాహి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 9గంటలకు హోమాన్ని ప్రారంభించగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్‌సేవ జరిగింది. భక్తులకు రమ్యానంద భారతి అనుగ్రహ బాషణచేశారు. కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిశుభ్ర పంచాయతీగా సాయినగర్



బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

తిరుచానూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సాయినగర్ పంచాయతీని పరిశుభ్రం పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని సర్పంచ్ డీవీ రమణ అన్నారు. సాయినగర్ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లను బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్వాక్రా భవనంలో సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

రైలు ఢీకొని కీ మ్యాన్ దుర్మరణం

దొరవారిసత్రం, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): రైలు ఢీకొనడంతో రైల్వే ఉద్యోగి దుర్మరణం చెందిన ఘటన దొరవారి సత్రం రైల్వేగేటు సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఏకొల్లు గ్రామానికి చెందిన బందిల గురవయ్య(33) రైల్వే కీ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంట ప్రాంతంలో పట్టాలు దాటుతుండగా న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే జీటీ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా నలిగి పోయింది. స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించి కుటుంబ సభ్యులతో పాటు, సూళ్లూరుపేట రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించారు., బంగారు తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు,ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

దివ్యాంగుల పింఛన్లపై వదంతులు నమ్మొద్దు

● టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



జీవన్‌కుమార్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తున్నారంటూ విపక్ష నేతలు సృష్టిస్తున్న వదంతులను నమ్మవద్దని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్రఉపాధ్యక్షుడు జీవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..గతవైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు అనర్హులు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో దివ్యాంగుల కేటగిరీలో పింఛన్లు తీసుకున్నారన్నారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన రీవెరిఫికేషన్‌లో అర్హులకు అన్యాయం జరిగిందన్న విమర్శలరె ఆయన ప్రస్తావిస్తూ నోటీసు అందుకున్న దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్‌కార్డులను మండలపరిషత్ కార్యాలయాలు, మున్సిపాలిటీపరిధిలోని సచివాలయాల్లో సమర్పించి ఫిర్యాదు చేయాలన్నారు. వీటిని వెరిఫికేషన్ చేసి అర్హులకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట జెడ్పీహైస్కూల్‌లో పద్మావతి వర్సిటీ న్యాయవిభాగం ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణపై లీగల్ సపోర్ట్ సెల్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, పారిశ్రామికీకరణ-పట్టణీకరణ, ప్లాస్టిక్ వినియోగం వంటి అంశాలు జీవనవైవిద్యానికి ప్రమాదాన్ని కలగజేస్తున్నాయన్నారు. వీటిపై అవగాహన కల్పించడంలో విద్యార్థులు, టీచర్లు కీలకభూమిక పోషించాలన్నారు. వర్సిటీ ఎగ్జామ్స్‌డీన్ ప్రొఫెసర్ కె.అనురాధ, ప్రొఫెసర్ సీతాకుమారి, ప్రొఫెసర్ సునీత కాణిపాకం, డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ శారద, స్కూల్ హెచ్‌ఎం భారతి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

ఏపీఈఎస్ఎస్ఏ కార్యవర్గం

తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినేట్స్ అసోసియేషన్ (ఏపీఈఎస్ఎస్ఏ)జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బి.గోవర్ధన్ యాదవ్ కార్యదర్శిగా మస్తాన్‌బాబు, వైస్‌ప్రెసిడెంట్‌గా స్వర్ణలత, కోశాధికారిగా శ్రీరామ రాఘవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వై.శ్రీనివాసరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

పేరూరు చెరువు పరిశీలన



తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): పేరూరు చెరువును శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. చుట్టు పక్కల పంచాయతీల మురుగునీరు చేరుతుండడంలో కాలుష్యం బారి నుంచి చెరువును కాపాడాలని ఇటీవల జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ నరేంద్రకుమార్, డీఈ ఉపేంద్రరెడ్డి, ఏఈ హిమంత్‌కుమార్‌చౌదరిలు వచ్చి మురుగునీరు చెరువుకి చేరకుండా అడ్డుకట్ట వేయలేమని, నీటిశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీపీకి వారు వివరించారు.

గ్రామసమాఖ్యల పటిష్టతతో ఆర్థికాభివృద్ధి

తిరుపతిరూరల్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్యల పటిష్టత ద్వారా మహిళలు మరింతగా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పేర్కొన్నారు. తనపల్లె, తిరుచానూరు గ్రామసమాఖ్య సభ్యులకు శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికలావాదేవీల ఆడిట్‌పై అవగాహన ఉండాలని, డిజిటల్ లావాదేవీలు మాత్రమే నిర్వహించాలని, కొన్ని ఆన్‌లైన్ యాప్‌ల బారిన పడకుండా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, సీసీలు రమేష్, సుజాత, సంఘమిత్రలు, మహిళాసభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం చెన్నయ్యగుంట పరిధిలోని శేషాచలం హిల్‌వ్యూ తుడా లేఅవుట్ పేస్-2లో గల 57ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామని, వాటి నుంచి విముక్తి లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషాచలం హిల్ వ్యూ లేఅవుట్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, కార్యదర్శి ఓవీ రామశర్మ, సభ్యులు రాజేంద్రప్రసాద్, లక్ష్మి, కార్తీక్, రమణ, ప్రభాకర్‌రెడ్డి, జ్యోతికృష్ణ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేశారు..కాలువలు మరిచారు





పాకాలలోని భారతంమిట్ట 10, 11వ వీధుల్లో మురుగు కాలువలు లేని రోడ్లు

పాకాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాకాల గ్రామపంచాయతీ పరిధిలో పురవీధుల్లో 90 శాతం మేర సిమెంటు రోడ్లు వేశారు. పలువీధుల్లో మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగునీళ్ల పారక ప్రజలు ఇబ్బంది పడు తున్నారు. భారతంమిట్ట 10వ వీధి, 11వ వీధుల్లో మురుగుకాలువలు నిర్మించలేదు. పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా నిర్మాణానికి నోచుకోలేదు. పాకాల రైల్వే గేటు నుంచి అంజినేయుల స్వామి గుడి వరకు సీసీ రోడ్డు వేశారు. ప్రధానమైన ఈ రహదారిలో మురుగు కాలువలు నిర్మించలేదు. రోడ్డుపైనే నీళ్లు పారుతుండడంతో పలుచోట్ల రోడ్లు గుంతలు పడుతున్నాయి. న్యూ కాలనీ, కమ్మవీధి, సత్యమ్మగుడి వీధి, ధర్మరాజుల గుడి వీధి, బండెలదొడ్డి వీధి, బజారు వీధి ప్రాంతాలలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన చిన్న సైజు కాలువల్లో మురుగునీరు పారడం ఇబ్బందిగా ఉంది. పలుచోట్ల కాలువలు పాడైపోయాయి. వీటి స్థానంలో నూతనంగా కాలువలు నిర్మించాల్సి ఉంది. అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని ఇక్కడి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నారాయణ డీఎస్సీ కోచింగ్ విద్యార్థుల ప్రతిభ



ఎం. ఉషారాణి-జి. సురేఖ - వి. కల్యాణి-కె.మహేష్‌బాబు

తిరుపతి(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో విజయవాడ నారాయణ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ డీఎస్సీ కోచింగ్ సెంటర్ (తిరుపతి) విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డైరెక్టర్ కె. నారాయణ తెలిపారు. ఎం. ఉషా రాణి ఎస్జీటీలో చిత్తూరు జిల్లా ప్రథమ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించిందన్నారు. జి. సురేఖ ఎస్ ఏ(వ మ్యా థ్స్)లో చిత్తూరు జిల్లా ప్రథమ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకును సాధించిందన్నారు. ఎస్ఏ (సోషల్)లో కె. మహేష్‌బాబు జిల్లాలో 3వ ర్యాంకు, ఎస్ఏ(బయాలజీ)లో వి. కళ్యాణి జిల్లాలో 3వ ర్యాంకు సాధించారన్నారు వీరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తమ విద్యార్థులు వెయ్యి మంది అర్హత సాధించారంటూ విజేతలకు ఒక ప్రకటనలో అభినందించారు.

శ్రీప్రజ్ఞ విజయభేరి



ఉత్తమ ర్యాంకర్లతో స్టడీ సర్కిల్ డైరెక్టర్ మల్లీశ్వరి

తిరుపతి(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 మెరిట్ లిస్ట్‌లో శ్రీప్రజ్ఞ స్టడీ సర్కిల్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ సంస్థ డైరెక్టర్ సి. మల్లీశ్వరి తెలిపారు.సురేష్‌కుమార్ ఎస్ఏ(సోషల్)లో రాష్ట్రసాయిలో 9వ ర్యాంకుతో పాటు జిల్లాలో మొదటి ర్యాంకును, ఎన్. కవిత జిల్లా 3వ ర్యాంకు, ఓసీ విభాగంలో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారన్నారు. జిల్లా స్థాయిలో ధర్మ ఎస్ఏ (మ్యాథ్స్)లో 7, యుగేంద్ర ఎస్ఏ(సోషల్)లో 8, రవీంద్ర ఎస్ఏ (ఫిజిక్స్)లో 9, నేత్ర ఎస్జీటీలో 10వ ర్యాంకు, బీసీ మహిళల విభాగంలో మొదటి ర్యాంకును సాధించారన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మల్లీశ్వరి, మోటివేటర్, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ హరిబాబు వీరిని అభినందించారు.

నిమజ్జనాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(జీవకోన), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జన మహోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలను జరుపుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ నిర్దేశించిన మార్గాల్లోనే విగ్రహాల ఊరేగింపు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన కమిటీ సభ్యులు ఊకా విజయకుమార్, ఎస్వీఎం వెంకటేష్, చెన్నం నవీన్, హేమకిరణ్, శేఖర్, బుజ్జి, భాస్కర్‌నాయుడు, వాసు, వరప్రసాద్, అనిల్, రవి, చంద్ర, దీపక్‌యాదవ్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా పదవీ ప్రమాణ కార్యక్రమం



విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఏఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భాష్యం బ్లూమ్స్ సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థుల పదవీ ప్రమాణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ సాకేత్ రామ్ ఆదేశాల మేరకు ముందుగా పాఠశాల హెడ్ బోయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, హౌస్ కెప్టెన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. విజేతలను విద్యాసంస్థల సీఈఓ హనుమంతరావు అభినందించారు. తిరుపతి జోన్ విద్యా పర్యవేక్షణాధికారి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ చిన్నవయసులోనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, క్రమశిక్షణను అలవరిచేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా శాంతి భద్రతల విభాగం ఏఎస్పీ రవిమనోహరాచారి విజేతలకు బాడ్జిలను అందజేసి అభినందించారు.

'టీటీడీ కాలేజీ హాస్టల్లో క్రైస్తవ మతస్తులకు అడ్మిషన్ ఇవ్వకండి'

● సనాతన ధర్మ పరిరక్షణ సమితి



పద్మావతి కాలేజీ ప్రిన్సిపాల్‌కు విన్నవిస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కాలేజీ హాస్టల్లో క్రైస్తవ మతస్తులకు అడ్మిషన్లు ఇవ్వకుండా చూడాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి కోరింది. పద్మావతి జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లకు ఆ సంస్థ నాయకులు కిరణ్ తదితరులు శనివారం వినతి పత్రం అందజేశారు. కొంతమంది హిందూ సర్టిఫికెట్లతో క్రైస్తవ మత విద్యార్థులు టీటీడీ కాలేజీల్లో అడ్మిషన్ పొందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిని హాస్టళ్ల నుంచి తొలగించాలని కోరారు. కాలేజీలో ఎవరైనా చదవచ్చునీ, అయితే హాస్టల్లో హిందూ విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్ ఇవ్వాలని సూచించారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా అంతరిక్ష వైజ్ఞానిక సంబరాలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

తిరుపతి(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం అంతరిక్ష వైజ్ఞానిక సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 6 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సైన్స్ ఫోరం, రోటరీ క్లబ్‌కు జనవిజ్ఞాన వేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు రెడ్డెప్ప, రఫీ, బర్లా నాయుడు, నాగేశ్వర్, రోటరీ క్లబ్ నాయకులు డాక్టర్ హరీష్, పురుషోత్తంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోము, రవి, కుమార్ పాల్గొన్నారు.

రేపు ఛలో కలెక్టరేట్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి భగత్ రవి తెలిపారు. జీవో-77 రద్దు, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, ఎస్సీ హాస్టల్స్ సమస్యలపై ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. నాయకులు అశోక్, వినోద్, తేజ, నరసన్న పాల్గొన్నారు.

వినాయకసాగర్‌లో సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు సమీపిస్తున్నా వినాయక సాగర్‌లో సమస్యలు అలాగే ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ నేతలతో కలిసి మున్సిపల్ అదనపు కమీషనర్ చరణ్‌తేజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. చిట్టిబాబు మాట్లాడుతూ వినాయక సాగర్‌లో నిమజ్జన ఏర్పాట్లు మందకొడిగా సాగుతున్నాయని తెలిపారు. పూడికతీయకనే నీటితో నింపేయడం వల్ల భక్తులు ఇబ్బందిపడే అవకాశాలున్నాయన్నారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతలకు ఈ నెలాఖరు నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు మధ్య దక్షిణ మధ్య రైల్వే పలు ప్రాంతాలకు 170 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.● తిరుపతి-చర్లపల్లి మధ్య సెప్టెంబరు 7 నుంచి 29వ తేదీ వరకు గుంటూరు మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఈ ప్రత్యేక రైలు(07481) తిరుపతిలో ప్రతి ఆదివారమూ బయలుదేరి మరుసటి రోజు చర్లపల్లికి.. చర్లపల్లిలో ఈ ప్రత్యేక రైలు(07482) సోమవారం బయలుదేరి మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుంది. ● చర్లపల్లిలో మరో ప్రత్యేక రైలు(07011) సెప్టెంబరు 5 నుంచి ప్రతి శుక్రవారమూ బయలుదేరి కాచిగూడ, షాద్‌నగర్, గుత్తి, రేణిగుంట స్టేషన్ల మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకుంటుంది. తిరుపతిలో (07012) సెప్టెంబరు 6 నుంచి ప్రతి శనివారమూ బయలుదేరి మరుసటి రోజు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు ఫస్ట్ ఏసీ, 2ఏసీ, 3ఏసీ, సెకండ్ స్లీపర్, సాధారణ కోచ్‌లతో ప్రయాణిస్తుంది.● చర్లపల్లి-వేలాంకన్ని మధ్య రెండు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు తెలిపారు. చర్లపల్లిలో ఈ ప్రత్యేక రైలు(07093) సెప్టెంబరు 4వ తేది బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, గుంటూరు, రేణిగుంట, తిరువణ్ణామలై, మైలాడుతురై, తిరువారూరు స్టేషన్ల మీదుగా మరుసటి రోజు నాగపట్టణం చేరుకుంటుంది. నాగపట్టణంలో ఈ ప్రత్యేక రైలు(07094) సెప్టెంబరు 5వ తేదీ బయలుదేరి మరుసటి రోజు చెర్లపల్లికి చేరుకుంటుంది. 2ఏసీ, 3ఏసీ, సెకండ్ స్లీపర్, సాధారణ కోచ్‌లతో నడుస్తుంది. ● తిరుపతి-హిస్సార్ మధ్య అక్టోబరు 1వ తేది నుంచి నవంబరు 30వ తేది వరకు ప్రతి బుధ, ఆదివారాల్లో ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు (07717) అక్టోబరు 1వ తేది బయలుదేరి రేణిగుంట, కడప, కర్నూల్ సిటీ, గద్వాల్, కాచిగూడ, నిజమాబాద్, బాసర మీదుగా రెండవ రోజు హిస్సార్‌కు చేరుకుంటుంది. హిస్సార్‌లో ఈ ప్రత్యేక రైలు(07718) బయలుదేరి వచ్చిన మార్గంలోనే తిరుపతికి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు 3ఏసీ కోచ్‌లతో రాకపోకలు సాగిస్తుంది. ● నరసాపురం-బెంగళూరు, నాందేడ్-ధర్మవరం, బీదర్-బెంగళూరు, జాల్నా-చప్రా, యశ్వంతపూర్-ధన్‌బాద్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

శాస్త్రోక్తంగా సహస్ర కలశాభిషేకం

వైభవంగా హనుమంత వాహన సేవ


తిరువీధుల్లో హనుమంత వాహనంపై కోదండరాముడి విహారం

తిరుపతి (కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా సహస్ర కలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సీతారాములు, లక్ష్మణ ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. 1008 కలశాలను స్థాపించారు. ప్రధాన కలశానికి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తర్వాత కలశ పూజ జరిపి హోమ గుండాన్ని వెలిగించారు. గణపతి హోమం అనంతరం సుదర్శన మంత్రాలతో పూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. తర్వాత ఉత్సవర్లకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, కలశంలో పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవర్లను అలంకరించి పంచ హారతులను సమర్పించారు. మహా నైవేద్యం నివేదించారు. సాయంత్రం హనుమంత వాహనంపై సీతారాములతో కలిసి లక్ష్మణ ఉత్సవమూర్తిని అధిరోహింపజేసి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తజనుల సాక్షిగా ఈ పురవిహారం అత్యంత వేడుకగా సాగింది.

హథీరాం బావాజీ ఆస్తులను కాపాడాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హథీరాం బావాజీ మఠం నిర్మాణాల కూల్చివేత నోటీసు ఉపసంహరించడమేగాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రస్టుబోర్డు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసి ఆస్తులను కాపాడాలని శ్రీస్వామి హథీరాం బావాజీ పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న హథీరాం బావాజీ మఠానికి మరమ్మతులు చేయాలన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను గుర్తించి, మఠానికి స్వాధీనం చేయాలని కోరారు. బంజార సాధుసంతుల వసతి నిమిత్తం తిరుమల, తిరుపతిలో సదుపాయాలు కల్పించాలన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


వైద్యులు, వైద్య విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో పెట్టుకోవాలని ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. కళాశాల ఆవరణలో ఆయన వైద్యాధికారులు, వైద్య విద్యార్థులతో కలిసి శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రాధ, ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. శుభ్రత ప్రాముఖ్యత గురించి రోగులకు అవగాహన కల్పించారు.

పరిశుభ్ర తిరుపతిని సాధిద్దాం

ఘనంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర


జగజ్జీవన్‌రామ్ పార్కులో చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య, తుడ చైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన తిరుపతి సాధన దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా బాబు జగజ్జీవన్ రామ్ పార్కులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. రామానాయుడు స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల శుభ్రత, జబ్బులు రాకుండా చేతులు కడుక్కోవడం, చెత్త కుప్పల తొలగింపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తిరుపతి స్వచ్ఛత కార్యక్రమంలో అవార్డు పొందిందని, మున్ముందు మరిన్ని పారిశుధ్య ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, రాష్ట్ర హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీయూఐడీ డైరెక్టర్ వూకా విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, కార్పొరేటర్ నరసింహ ఆచారి, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దామినేడు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో కలెక్టర్ వెంకటేశ్వర్


డ్రైనేజీలో చెత్త తొలగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతి రూరల్ తిరుచానూరు పంచాయతీ దామినేడులో ట్రైనీ కలెక్టర్ రఘువన్షితో కలిసి ఆయన పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన, డ్రైనేజీ క్లీనింగ్ వంటి ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో చెత్త పెద్ద సమస్యగా మారిందని, ప్రజలు అవగాహనతో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వేస్టేజ్‌ను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి మాట్లాడుతూ ఇంటి వద్ద ఉన్న నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు గ్రామంలోని మురుగునీటి కాలువల, నీటి తొట్టెలను కలెక్టర్ పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు చెత్తను చెత్తరథానికి ఇవ్వడంతో నిత్యావసర సరుకులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. వర్మీకంపోస్టును రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, జిల్లా పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

27న కపిలేశ్వరాలయంలో చవితి వేడుకలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీన వినాయక చవితి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక స్వామి మూలవర్లకు అభిషేక, అర్చన పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గోవింద నామాలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర వీధుల్లో శనివారం గోవింద నామాలతో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భజన మండలి కళాకారులు గోవింద నామాలను స్మరిస్తూ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పద్మావతి డిగ్రీ కాలేజీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కాలేజీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ నేతృత్వంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

అబ్బురం.. ప్రత్యేక ప్రతిభావంతుల కళా ప్రదర్శన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మహతి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రతిభావంతుల కళా ప్రదర్శన అబ్బురపరచింది. ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో 90 మందికిపైగా చిన్నారులు కళాప్రదర్శన ఇచ్చారు. తిరుపతి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ లత ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్, శ్రీవెంకటేశ్వర డెఫ్ అండ్ డమ్ స్కూల్, పాస్ మనోవికాస్, రాస్, అక్షయ క్షేత్రం వంటి ప్రముఖ సంస్థల నుంచి చిన్నారులు నృత్య ప్రదర్శనలిచ్చారు. ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తున్న బాపారావు, పర్యావరణం మీద అవగాహన కల్పిస్తున్న బాబును సత్కరించారు. ప్రేరణ సభ్యులు రాజశేఖర్, తరుణ్,ర ఎస్పీ గణేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్లలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. స్టేషన్ల చుట్టూ పెరిగిన ముళ్లకంపలు తొలగించారు. తిరుపతి ఈస్ట్, అలిపిరి, వర్సిటీ, వెస్ట్, రూరల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నాయుడుపేట, వాకాడు, సూళ్లూరుపేట పోలీసు స్టేషన్లలో సిబ్బంది డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఎస్వీయూలోని ఆయన విగ్రహానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ ఎస్వీయూ స్థాపనలో టంగుటూరి ప్రకాశం పంతులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, ప్రిన్సిపాళ్లు పద్మావతి, శ్రీనివాసులు, పరీక్షల డీన్ సురేంద్రబాబు, సీఈ రాజమాణిక్యం, ఇంజినీర్ తాండవకృష్ణ, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, లా విభాగ ప్రొఫెసర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకేదిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కొలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోయారు. ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ నాయకులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే యూటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి తండ్రి మరణించడంతో పార్టీ నాయకులు, సీఐటీయూ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో వి.నాగరాజు, కందారపు మురళి, ఎ.పుల్లయ్య, జనార్దన్, సాయిలక్ష్మి ఉన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రాములవారి దక్షిణమాడ వీధిలోని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయలసీమ రంగస్థల కళాకారుల చైర్మన్ గుండాల గోపీనాథ్, తొండంనాడు సుబ్రమణ్యంరెడ్డి, జయంత్ కుమార్, బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ సీనియర్ అసిస్టెంట్ పీఆర్ఎల్‌కుమార్, క్యాషియర్ హారిక, టీడీపీ బ్రాహ్మణ సాధికారిక సమితి రాష్ట్ర సభ్యుడు హనుమంతరావు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రిపై ఆరోపణలు తగవు


మీడియాతో శ్రీపతిబాబు

తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ నాయకులు శ్రీపతిబాబు కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. తిరుపతిలో ఆయన, ఆయన కుమారుడి ఆగడాలు అందరికీ తెలుసన్నారు. వారి అరాచకాలను వెలుగులోకి తెస్తుండటంతో టీడీపీలోని ఓ అధికార ప్రతినిధితో కలిసి ఇన్‌చార్జి మంత్రిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగరాజు, సుబ్బయ్య, రేవతి, మురళి పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధన రాజు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా సేవకుడిగా, ధీరుడుగా టంగుటూరి మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు, సీఐలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ సంజయ్ కరోల్

తిరుమల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

సూర్యఘర్ లబ్ధిదారులను ప్రోత్సహించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారిని ప్రోత్సహించాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. సదరన్ డిస్కం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం డిస్కంలోని 9 జిల్లాల రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం వల్ల సంస్థపై విద్యుత్ కొనుగోలు భారం తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకం వినియోగదారుల సర్వీసులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ వినియోగదారులకు ఉపయోగపడుతోందని, సంస్థకు విద్యుత్ చౌకగా లభిస్తోందని తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ బకాయిలు 100 శాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అంతకు ముందు సంస్థ రెవెన్యూ విభాగం చీఫ్ జనరల్ మేనేజరు కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని విద్యుత్ రెవెన్యూ వసూలు అంశాలపై సమీక్ష చేశారు. 9 జిల్లాల ఎస్ఏవోలు, ఏవోలు, ఏఏవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,067

తలనీలాలు సమర్పించినవారు: 25,212



ఆదివారం ప్రత్యేకం

వైకల్యాన్ని ఓడించాడు

ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్

క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం

కొందరు చిన్న కష్టం ఎదురైతేనే నిరాశ చెందుతారు. జీవితాన్నే కోల్పోయినట్లు భావిస్తారు. కానీ అన్వేష్ అలా కాదు. ప్రమాదవశాత్తూ ఒక చెయ్యి పోయినా ఆత్మవిశ్వాసాన్ని వీడలేదు. వైకల్యంగా భావించలేదు. తనలోని క్రీడా సంకల్పాన్ని చెక్కు చెదరనివ్వలేదు. ఒంటిచేత్తోనే బతుకుబండి నడుపుతున్నాడు. మరోపక్క తాను ప్రాణానికి ప్రాణంగా భావించే క్రీడల్లోనూ రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు. నిరంతర సాధనతో సాధ్యం కానిదేదీ లేదంటూ నిరూపిస్తూ స్ఫూర్తిని చాటుతున్నాడు అన్వేష్.

- గూడూరు, ఆంధ్రజ్యోతి






బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీలలో ప్రతిభాపురస్కారాన్ని అందుకుంటున్న అన్వేష్

గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టకు చెందిన మరియమ్మ, కృష్ణయ్య దంపతుల కుమారుడు అన్వేష్ పురుషోత్తమ్. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ నేపథ్యం. చదువుతో పాటు క్రీడలంటే కూడా ఇష్టం. వాకాడు గురుకుల పాఠశాలలో చదువుతున్నప్పుడు సాఫ్ట్‌బాల్, రెజ్లింగ్, షాట్‌పుట్, వాలీబాల్‌లలో శిక్షణ పొందాడు. విశేష ప్రతిభ కనబరిచాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచాడు. నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివాక గూడూరులోని ఓ పరిశ్రమలో చిరుద్యోగంలో చేరాడు. 2011లో పెళ్లయిన అన్వేష్‌కు పాప, బాబు ఉన్నారు. 2014లో దురదృష్టం వెంటాడింది. పరిశ్రమలో జరిగిన ఓ సంఘటన అన్వేష్‌ను అంగవికలుడ్ని చేసింది. కుడి చేయిని కోల్పోయాడు. రెండేళ్లపాటు ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. కొద్దిగా కోలుకున్నాక మనసు మళ్లీ క్రీడలమీదకు మళ్లింది. ఇందుకోసం ఒంటిచేతితోనే కఠోర సాధన చేశాడు. క్రీడా నైపుణ్యానికి పదునుపెట్టాడు. షటిల్, షాట్‌పుట్, క్రికెట్ వంటి క్రీడలతో పాటు పలు అథ్లెటిక్స్ ఆడటంలో సఫలీకృతుడయ్యాడు. నైరాశ్యాన్ని తరిమేసి దివ్యాంగుల క్రీడాపోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. జాతీయస్థాయిలో పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అంతర్జాతీయ పారా క్రికెట్ క్రీడల పోటీల్లో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాడు.

సాధించిన విజయాల్లో కొన్ని..

● 2020లో విశాఖపట్నం 2021లో అనంతపురం, 2022లో కాకినాడ, 2023లో విశాఖట్నంలలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించాడు. 2021లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ● 2023లో భారత్-బంగ్లాదేశ్ టీ-20 పోటీల్లో జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ బోర్డులో సభ్యత్వం సాధించాడు. అదేఏడాది బెంగళూరు అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలను గెల్చుకున్నాడు. కోయంబత్తూరు ఐపీసీఎల్ క్రికెట్ పోటీల్లో జట్టు విజయానికి దోహదపడ్డాడు. నేపాల్‌తో జరిగిన టీ-20, వన్‌డే సీరిస్‌ల్లో భారత్ విజయం వెనుక బలమైన పాత్ర పోషించాడు. అన్వేష్ సాధించిన క్రీడా విజయాలకు ప్రోత్సాహకరంగా పలు పురస్కారాలను అందుకున్నాడు.

చేయూత ఇవ్వండి..

పోటీలకు వెళ్లాలని ఉత్సాహమున్నా ఆర్థిక స్థోమత ప్రతిబంధకమవుతోంది. సొంతంగా నిధులు సమకూర్చుకోవడం కష్టంగా ఉంటోంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చు చాలానే అవుతుంది. దాతలు లేదా ప్రభుత్వం కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని విజయాలను సాధిస్తా.

- అన్వేష్ పురుషోత్తమ్

‘మఠం’ భవనాన్ని పూర్తిగా కూల్చం

● దెబ్బతిన్న చోటే పునర్నిర్మాణం ● ఐఐటీ నివేదికను అనుసరిస్తాం ● మరోసారి సమావేశమై తుదినిర్ణయం ● భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్


మఠం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హథీరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చబోమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. కుంగిన, పగుళ్లు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే కూల్చడమా? లేదా రెట్రోఫిటింగ్ రీకన్‌స్ట్రక్షన్ చేయడమా? అనేది మరో నాలుగురోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఐటీ నివేదిక ఆధారంగా ప్రజలకు ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘హథీరాంజీ మఠానికి 125ఏళ్ల చరిత్ర ఉంది. కాలక్రమంలో ఇక్కడ దేవదాయశాఖ ఆర్జేసీ కార్యాలయం, మఠం పరిపాలన, సుమారు 60 షాపులకుపైగా అద్దెకు ఇచ్చారు. నిర్వహణ సరిగాలేక భవనం శిథిలావస్థకు చేరింది. ఏడేళ్లుగా కార్పొరేషన్‌కు తరచూ ఫిర్యాదులు వచ్చాయి. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే ప్రాణనష్టం కలిగే అవకాశం ఉండటంత మఠం వాళ్లు దేవదాయశాఖకు లేఖ రాశారు. ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారు. పగుళ్లు, కుంగిపోయిన ప్రదేశాలను చూసి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు నివేదకలో స్పష్టంగా తేల్చారు. హథీరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామన్నది అపోహమాత్రమే. మఠానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల పగుళ్లు, కుంగిపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరింది. ఎవరికీ ప్రాణం నష్టం జరగకూడదనేదే ప్రభుత్వం ఉద్దేశం. ఈ మఠం బంజారా కమిటీకి సెంటిమెంటుతో కూడినదని వారి మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉండదు’ అని తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా.ఇక్కడి వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ పరిస్థితులను పరిశీలించామన్నారు.భవనాన్ని పూర్తిగా కూల్చి వేస్తామని మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. ఐఐటీ నిపుణుల నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, మఠం ఏవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ యూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ కుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర కూటమినేతలు బీఎల్ సంజయ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, ఆముదాల తులసీరాం, రాజా రెడ్డి, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మఠం భవనం కూల్చొద్దు

● హథీరాంజీ మఠంలో బంజారా సాధువులు, భక్తుల నిరసన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాన్ని కూల్చొద్దంటూ బంజారా మహంతు, హథీరామ్ బాబాజీ మహాసంఘ్ సభ్యులు శనివారం నిరసనకు దిగారు. మఠం భవనాల పరిశీలనకు ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారనే సమచారంతో వీరంతా ఇక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్వరస్వామి పరమభక్తుడు హథీరాంజీ జ్ఞాపకాలకు గుర్తు ఈ మఠం భవనమని పేర్కొన్నారు. పురాతన ఈ కట్టడాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరారు. కూల్చాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ సంఘ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. మఠం జ్ఞాపకాలను చెరపడం లేదని, అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి నష్టం కలగకూడదనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

స్విమ్స్ వర్సిటీ పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబరు 5 వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ, ఎంఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్సెస్, ఎంఎస్సీ క్లీనికల్ వైరాలజీ, ఎంఎస్సీ క్లీనికల్ సైకాలజీ వంటి పీజీ కోర్సులతోపాటు స్పెషలైజేడ్ నర్సింగ్ కోర్సులకు ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

నేడు ఏపీపీఎస్సీ డిపార్టుమెంటల్ పరీక్ష

- హాజరు కానున్న 1,450 మంది అభ్యర్థులు -


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ కంప్యూటర్ డిపార్ట్‌మెంటల్ పరీక్ష(గ్రామ సర్వేయర్లు)కు ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని, 1,450మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. మొత్తం మూడు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, జగదీష్, యోగేష్ పాల్గొన్నారు.

కర్ణాటక జంట ఆత్మహత్య


వెంకటరాజు, అనుష మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం వడ్డగిరికి చెందిన జంట తిరుపతిలోని ఒక లాడ్జిలో శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. వడ్డగిరికి చెందిన వెంకటరాజు(34), అనుష(25) ఇంటి నుంచి పారిపోయి శుక్రవారం తిరుపతికి వచ్చారు. శ్రీవారి దర్శనానికి వచ్చినట్లు చెప్పి స్థానిక శివకృష్ణ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులుగా వారు బయటకు రాక పోవడంతో అనుమానం వచ్చి గది తాళాలు పగులకొట్టి చూశారు. ఇద్దరూ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించారు. వెంటనే లాడ్జి మేనేజర్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియలేదని, బెంగళూరులోని చామరాజుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ అరగంటలోనే నగలు ఎత్తుకెళ్లారు

● 80 గ్రాముల ఆభరణాల చోరీపై కేసు నమోదు


చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లోని టీవీ వెనుక కప్‌బోర్డులో 80 గ్రాముల బంగారు నగలు ఉంచారు. 20వ తేది చూస్తే ఉన్నాయి. శుక్రవారం ఉదయం చూస్తే లేవు. 20వ తేదీన మధ్యాహ్నం షాపునకు వెళ్లొచ్చిన అరగంట వ్యవధిలోనే దొంగతనం చేసుంటారని భావించారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. దుర్గసముద్రంలో పత్తి మునెమ్మ, రామచంద్రయ్య దంపతులు ఉంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు రామచంద్రయ్య తన అక్క ఇంటికి వెళ్లారు. 3.30 గంటల సమయంలో మునెమ్మ ఆకు వక్క తీసుకురావడానికి ఇంటికి తాళమేసి, తలుపు పక్కన బ్యాగులో ఆ తాళాలు ఉంచి వెళ్లారు. అరగంట తర్వాత ఆమె తిరిగొచ్చారు. తలుపునకు తాళం వేసుండటంతో ఎలాంటి అనుమానం రాలేదు. శుక్రవారం ఉదయం చూడగా టీవీ వెనుక ఉంచిన దాదాపు 80 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇళ్లంతా వెదికారు. ఎక్కడా కనిపించక పోవడంతో శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందును కలసి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షేక్ షావలి, పోలీసులు, డాగ్, వేలి ముద్రలు నిపుణులు పరిశీలించారు. ఇప్పటికే అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులకు కేసులో కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది.

ఎరువుల దుకాణాలపై విజిలెన్సు దాడులు

● 577 యూరియా బస్తాల సీజ్



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్సు దాడులు చేపట్టారు. రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్న వైనంపై తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు డీఎస్పీ మల్లికార్జునరావు నేతృత్వంలో సీఐలు వెంకటరవి, చంద్రశేఖర నాయక్, విజిలెన్సు ఏవో రామాంజనేయులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. గూడూరులో సాయి బాలాజీ రైతు డిపోలో 577 యూరియా బస్తాలు సీజ్ చేశారు.

తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీకి కసరత్తు

● 26న రేణిగుంట వై కన్వెన్షన్ హాలులో సమావేశం

● పరిశీలకులుగా మంత్రి సవిత సహా ఇద్దరు కార్పొరేషన్ల ఛైర్మన్లు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు కసరత్తు ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీన మంగళవారం తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. పార్లమెంటు కమిటీ ఏర్పాటుపై చర్చించి, సమావేశం సజావుగా జరిగేలా చూసేందుకు అధిష్ఠానం ముగ్గురు పరిశీలకులను నియమించింది. ఆ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు. 26న రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాలులో ఉదయం 10 నుంచీ సాయంత్రం 5 వరకూ సమావేశం జరగనుంది. దీనికి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొదలుకుని జాతీయ, రాష్ట్ర కమిటీలలోని ప్రతినిధులు, రాష్ట్ర అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రస్తుత జిల్లా కమిటీ, జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల్లో వున్న వారు... ఇలా సుమారు 200 మంది దాకా ప్రతినిధులు హాజరు కానున్నారు. పరిశీలకుల ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పార్లమెంటు కమిటీలోని 34 పదవులకు, అలాగే రాష్ట్ర కమిటీకి ఆయా నియోజకవర్గాల నుంచీ ఆశావహుల జాబితాలను ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు పార్టీ పరిశీలకులకు అందజేయనున్నారు. ముఖ్యంగా పార్లమెంటు కమిటీకి సంబంధించి ప్రధాన సామాజికవర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు తగిన ప్రాతినిధ్యం వుండేలా, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకూ ప్రాతినిధ్యం వుండేలా జాగ్రత్త వహించనున్నారు. పార్లమెంటు, రాష్ట్ర కమిటీలలో వివిధ పదవులను ఆశిస్తున్న వారి జాబితాలను, ఎమ్మెల్యేలు, ఇంచార్జులు సిఫారసు చేసిన జాబితాలను పరిశీలకులు అదే రోజు సాయంత్రం అధిష్ఠానానికి పంపించనున్నారు. ఈ నెలాఖరులోపే పార్లమెంటు కమిటీని అధిష్ఠానం ప్రకటించే అవకాశముంది.

నేటి నుంచి అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు

● మైదానాల్లో విస్తృత ఏర్పాట్లు


ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్‌కు సిద్ధమైన ట్రాక్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే పోటీల ఏర్పాట్లను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, ఎస్వీయూ క్యాంపస్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్‌స్కూల్ వద్ద వాలీబాల్, ఆర్చరీ, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఎస్వీఆర్ఠ్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరుగుతాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అధికారులు మొత్తం 1,700మంది ఆదివారం ఉదయానికి చేరుకుంటారు. ఎస్వీయూ, మహిళా వర్సిటీలలో వసతుల కు సంబంధిచి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎస్వీయూ మైదానంలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా రవాణా, క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్,ం హాజరుకానున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

● విద్యార్థులు సురక్షితం


పొలంలోకి దూసుకెళ్లిన దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లె సమీపంలో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ విద్యార్థులెవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షేమంగా బయట పడ్డారు. శనివారం ఉదయం చంద్రగిరిలోని ఓప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు పుల్లయ్యగారిపల్లె నుంచి చంద్రగిరికి వస్తోంది. దారిలో ఆటో ఎదురుగా రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

పుత్తూరు వార్తలు

శల్యవైద్య గ్రామస్తుల రాకపోకలకు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అంతరాయం

వనొస్తే నీటి నిల్వ.. ఏడు గ్రామాల ప్రజల అవస్థలు



పుత్తూరు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): పప్పు బెల్లాలు పంచి పెట్టాం కొట్టుకు చావండి సామెతను రైల్వే శాఖ నిర్మించిన రాచపాలెం అండర్ బ్రిడ్జి గుర్తుకు తెస్తోంది. ప్రఖ్యాత శల్య వైద్యానికి కేంద్రమైన రాచపాలెం వెళ్లేదారిలో తిరుపతి -చెన్నై రైల్వే లైను వద్ద ఉన్న మ్యాన్ గేటును మూసివేసి ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జిని రైల్వే శాఖ నిర్మించింది. రైల్వే లైనుకు అవతల రాచపాలెంతో పాటు ఈశ్వరాపురం, బొజ్జనత్తం వంటి ఏడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారి గుండానే రాకపోకలు సాగించాల్సి వుంది. శల్య వైద్యం కోసం వచ్చే రోగులు ఆటోల్లో ఇతర వాహనాల్లో ప్రయాణించాల్సి ఉంది. అయితే ఈ అండర్ బ్రిడ్జిలో వర్షాకాలంలో ఒకటిన్నర అడుగు లోతు ఊటనీరు చేరడంతో ప్రతి రోజూ ఉదయం తప్పని సరిగా తోడేయాల్సి ఉంది. లేకపోతే మరింత నీటి మట్టం పెరిగి ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. అండర్ బ్రిడ్జి తక్కువగా ఉండడంతో రైతులు మామిడి, వరి, చెరుకు పంటల దిగుబడులను లారీల్లో తరలించేందుకు వీలుకావడం లేదు. ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. బోరు వాహనాలు వెళ్లలేక పోతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ గ్రామాలకు ఇరువైపులా రెండు రైలు మార్గాలు ఉండడంతో తప్పనిసరై ఈ అండర్‌బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రాత్రిపూట లైట్లు లేక అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీ పుత్తూరు మున్సిపాలిటీలో చేరడంతో ఊటనీరు తోడే పని మున్సిపల్ కార్మికులు చేయాల్సి ఉంది. ఈ పనిని చేయడంలో కాస్త ఆలస్యమైతే పాదచారులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి బ్రిడ్జినీరు తరచూ తోడేయాలని, లైట్లు ఏర్పాటు చేయాలని, బ్రిడ్జి కింద పాదచారులు నడిచేలా ఓ దారి ఏర్పాటు చేయాలని ఏడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి



పుత్తూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): పుత్తూరు కోర్టులో సెప్టెంబర్ 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి కోరారు. శనివారం పోలీస్ అధికారులతో సమీక్షించారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని తెలియజేశారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించు కునేలా చొరవ తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, పుత్తూరు సీఐ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి చూపించాలని దళితులకు ధర్నా

పుత్తూరు టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి దారి చూపించాలంటూ దళితులు ధర్నా చేశారు. ఈ సంఘటన పుత్తూరు మండల పరిధిలోని తడుకు గ్రామంలో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా తడుకు గ్రామంలోని యువత వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్టేజీ వేస్తుండగా అదేదారిలో వెళ్లాల్సిన ఎగువ గూలూరు దళితులు తమకు దారికి అడ్డుగా ఉందని, స్టేజిని తీసివేయాలని చెప్పారు. ఈ విషయంపై ఇరు వురికి వాగ్వివాదం చోటుచేసుకోవడంతో తడుకు గ్రామంలోని యువత స్టేజి తీసివేశారు. అనంతరం దళితులు భవిష్యత్తులో కూడా ఇలాగే దారి లేకుండా చేస్తారనే నెపంతో ధర్నా చేపట్టారు. తమకు రాకపోకలు సాగించడానికి ఇటు తడుకులోను, అలాగే శిరుగురాజపాలెం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతులతో పేరుతో మూసివేయడంతో ఎలా వెళ్లాలని వారు ప్రశ్నించారు. తమ రాక పోకలు సాగించడానికి ప్రత్యామ్యాయంగా దారిచూపాలని పోలీసులను కోరారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి

పుత్తూరు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు విధిగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహులు అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను విద్యార్థులు తొలగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, బాబురావు, షర్మిల పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అప్పలాయ గుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ జరిపించారు. అనంతరం మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థుల స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ

వడమాలపేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శుభ్రత, పరిశుభ్రత, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలి వద్ద రాష్ట్రం స్వచ్ఛ ఆంధ్రగా నిలవాలంటూ ప్రతిజ్ఞ చేశారు.

డిష్, నెట్ వైర్లను తొలగించండి



అధికారులతో సమావేశమైన ఎస్ఈ సురేంద్ర

పుత్తూరు, ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ స్తంభాలకు ఉన్న డిష్, నెట్ వైర్లను తొలగించాలని తిరుపతి విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశించారు. పుత్తూరు విద్యుత్ డిఈ కార్యాలయంలో శనివారం పుత్తూరు, నాగలాపురం సబ్‌డివిజన్ల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలోని కేబుల్ ఆపరేటర్లకు 15 రోజుల్లో నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు. ఈ సమావేశంలో ఆశీర్వాదం డీఈ, ఏడీఈలు శంకరయ్య, రమేష్, ఏఈలు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైలు ఢీకొని కీ మ్యాన్ దుర్మరణం



గురవయ్య(ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): రైలు ఢీకొనడంతో రైల్వే ఉద్యోగి దుర్మరణం చెందిన ఘటన దొరవారి సత్రం రైల్వేగేటు సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఏకొల్లు గ్రామానికి చెందిన బందిల గురవయ్య(33) రైల్వే కీ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంట ప్రాంతంలో పట్టాలు దాటుతుండగా న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే జీటీ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృత దేహం గుర్తు పట్టలేని విధంగా నలిగి పోయింది. స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించి కుటుంబ సభ్యులతో పాటు, సూళ్లూరుపేట రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నిర్మాణం పూర్తయి ప్రారంభించకపోవడంతో ఖాళీగా ఉన్న కాట్రగుంట సచివాలయ, రైతు సేవ, ఆరోగ్య కేంద్రం భవనాలు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

బాలాయపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో వైసీపీ హయాంలో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. బాలాయపల్లిలో రూ.21.8 లక్షల వ్యయంతో 2022లో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం నిర్మాణం 2023లో పూర్తి చేశారు. కానీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఇదిలా ఉండగా వ్యవసాయశాఖకు సొంత భవనం లేకపోవడంతో ఆశాఖ అధికారులు వివిధ భవనాల్లో విధులు నిర్వహించుకోల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణం పూర్తయిన భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకుని వస్తే వ్యవసాయశాఖ అధికారులకు, రైతులకు సౌకర్యంగా ఉంటుంది. అదేవిధంగా కాట్రగుంట గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.20.80 లక్షలతో ఆరోగ్య కేంద్రం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం పనులు 2021లో ప్రారంభించి 2023లో పూర్తి చేశారు. వీటినీ ప్రారంభించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. కాగా, పంచాయతీ భవనంలోని ఇరుకు గదుల్లోనే సచివాలయం, వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఖాళీగా ఉన్న భవనాలను ప్రారంభిస్తే అధికారులతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

చంద్రయాన్-3తో ఇనుమడించిన భారత ఖ్యాతి



నేషనల్ స్పేస్ డే కార్యక్రమంలో విద్యార్థులు

చిల్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం రేస్ పాఠశాలలో శనివారం నేషనల్ స్పేస్ డే నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ నమూనాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బాలచెన్నయ్య మాట్లాడుతూ ఆర్యభట్ట ఉపగ్రహం నుంచి నేటి చంద్రయాన్-3 వరకు శ్రీహరికోటలోని షార్ నుంచి ఎన్నో ఉపగ్రహాలను ప్రయోగించడం జరిగిందన్నారు. చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్-3 సురక్షితంగా ల్యాండ్ అయి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన రోజును నేషనల్ స్పేస్ డేగా జరుపుకోవడం జరుగుతోందన్నారు.

ఓజిలి: మండలంలోని చిల్లమానుచేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ స్పేస్ డే నిర్వహించారు. విద్యార్థులు స్పేస్ టెక్నాలజీపై తయారు చేసిన వివిధ మోడల్స్ చార్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ జాతీయ అంతరిక్ష దినోత్సవం ప్రాముఖ్యం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, సల్మా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం హైదరాబాదుకు చెందిన ఏవీకే టెక్ సొల్యూషన్ పీఎల్‌డీ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ, ఏఐడీఎస్, ఐటీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన 232 మందికి రాత పరీక్ష నిర్వహించారు. ఫైనల్ రౌండ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషొందర్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

పెళ్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కగారిపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తొట్టంబేడు మండలం దొమ్మరపాళెంకు చెందిన అంకయ్య పెళ్లకూరు నుంచి దొమ్మరపాళెంకు ఆటో డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా అక్కగారిపేట వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అంకయ్యకు గాయాలయ్యాయి. అతడిని హైవే అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు

నాయుడుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పలు దుకాణాలను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేరంటాలమ్మ ఆలయంలో పూజలు



సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటపోలూరు నారాయణ పేరంటాలమ్మ ఆలయంలో 4వ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. అమ్మవారు ముత్యాల చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొండమరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

సూళ్లూరుపేట, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా పోరాడాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు అన్నారు. శనివారం సూళ్లూరుపేటలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిట్ల చిన్న, కిరణ్ కుమార్, కిషోర్, సుధాకర్, గోకుల్, సాయి, సిద్ధయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కోటలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌పీవో, అధికారులు

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలో శనివారం డీఎల్‌పీవో వాణిరెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వేణు, పలు శాఖల ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులో శనివారం రెవెన్యూ, వైద్యశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు, పీహెచ్‌సీ డాక్టర్ షాలోమ్ అరాఫత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ చేరకుండా చూడాలని, నీటి తొట్లెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో కొండా రామచంద్రారెడ్డి, బెల్లకొండ రాజేంద్ర, దాసరి రాము, గోపి, ఆర్ఐ పూర్ణా, వీఆర్‌వోలు రమణయ్య, లక్ష్మీనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్

యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం కలిపేడు గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ప్రవీణ్(22) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన ప్రవీణ్ శుక్రవారం రాత్రి కలిపేడు సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. గాయపడిన ప్రవీణ్‌ను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

దొరవారిసత్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం సూరపు అగ్రహారం అడవిలో పేకాట స్థావరంపై ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4130 స్వాధీనం చేసుకొన్నారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

నాయుడుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అధిక గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను మడపలం గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. టిప్పర్లు ఆగిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి మడపలం గ్రామస్తులతో మాట్లాడారు. 40 టన్నుల సామర్థ్యం ఉన్న రోడ్డుపై దాదాపు 60 టన్నుల లోడ్‌తో టిప్పర్లు వెళ్తున్నాయని, రోజూ 30 టిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో ఓడ్డు దెబ్బతింటోందన్నారు. సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ తీసుకెళ్తున్నారని రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు సర్దిచెప్పారు. పోలీసులు టిప్పర్లను తరలించో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళలను చైతన్యం చేసి బాల్య వివాహాలను నిర్మూలిద్దామని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. కోటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లతో బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష జరిగింది. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, అందుకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

జేవీవీ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహనను పెంపొందించేలా జేవీవీ సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో చెంచునారాయణ, రామ్మోహన్, సుబ్బారావు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, రజినీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో శనివారం పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, పెంచలయ్య, యశ్వంత్, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

పెళ్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ప్రమీలారాణి సూచించారు. శని వారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాల గురించి సమీక్షించారు.

టంగుటూరికి నివాళి

వాకాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ నివాళులర్పించారు.

భూ సమస్య పరిష్కరించండి

చిట్టమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమసముద్రం గ్రామంలో శ్మశానవాటిక భూ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన దళితులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. శ్మశానవాటిక స్థలాన్ని డీకేటీ పట్టా ఇవ్వడం తగదని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ సతీష్ హామీ ఇచ్చారు.

పులికాట్‌ను సందర్శించిన అటవీశాఖ శాఖ ప్రత్యేక కార్యదర్శి



అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ కార్యదర్శి అనంతరాము, పక్కన ఆర్డీవో, డీఎఫ్‌వో

సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.అనంతరాము శనివారం పులికాట్ సరస్సును సందర్శించారు. ఆయనకు అటవీశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికి పులికాట్‌లో పక్షులు, పర్యావరణ విజ్ఞాన కేంద్రం గురించి వివరించారు. అనంతరం ఆయన షార్‌ను సందర్శించారు. శ్రీహరికోటలో ఉన్న ప్రయోగ వేదికతో పాటు స్పేస్ మ్యూజియాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, డీఎఫ్‌వో హారిక, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో రమణయ్య తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులు అవగాహన కలిగివుండాలని సీడీపీవో మెహబూబి అన్నారు. శనివారం స్థానిక చవటపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బాల్య వివాహాల నిర్మూలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వరూపారాణి, కుమార్, భారతి, యశోధ, దేవసేనమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీవో 30ను సద్వినియోగం చేసుకోండి

తడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీచేసిన జీవో 30ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్‌లు, అక్రమ నిర్మాణాలు అభ్యంతరాలులేని ప్రభుత్వ స్థలాలలో ఇళ్లు నిర్మించుకున్న వారు వాటిని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జీవో ప్రకారం 300 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, ఆపై నిర్మాణాలకు ప్రభుత్వం సూచించిన ప్రకారం తగిన రుసుంతో క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈఅవకాశం నవంబరు 30వరకు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మురుగునీరు నిల్వచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోయారు. ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించండి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహారావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహారావు అన్నారు. పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజే సౌండ్స్, రికార్డింగ్ డ్యాన్స్, బలవంతపు వసూళ్లు, ముందస్తు అనుమతి లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

మృతదేహాల కోసం ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ నిఘా

ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు



శ్రీకాళహస్తి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫ్రీజర్ బాక్సుల అద్దె వ్యాపారం కోసం ఓ ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ ఆస్పత్రికి వచ్చే మృతదేహాలపై నిఘా ఉంచాడు. తన సెల్‌ఫోన్ నుంచే పర్యవేక్షించుకునేలా సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాను ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్దనే ఏర్పాటు చేశాడు. ఈ ఉదంతం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద చోటు చేసుకోవడంతో అందరూ ముక్కున వేలేసు కుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన ఓ యువకుడు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఫ్రీజరు బాక్సులను అద్దెకు ఇచ్చే వ్యాపారం చేస్తుంటాడు. కొద్ది నెలలక్రితం ప్రైవేటు అంబులెన్సు కూడా కొనుగోలు చేసి ఆస్పత్రి ద్వారం పక్కనే అద్దెకు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఫ్రీజరు బాక్సు వ్యాపారం కోసం ఆస్పత్రికి వచ్చే శవాల లెక్కను అప్పటికప్పుడే గుర్తించి మృతుల కుటుంబాల వెంటపడేందుకు ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదురుగా సోలార్ కెమెరాను ఏర్పాటు చేశాడు. ఇది ఒక సిమ్‌కార్డు, మెమరీ కార్డు ద్వారా మొత్తం వీడియోలను నిక్షిప్తం చేస్తుంది. ఈ మార్గంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులు, మహిళలు నిత్యం సంచరిస్తుంటారు. రోడ్డులో కెమెరా మనుషుల కదలికలను బట్టి తిరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓ ప్రైవేటు వ్యక్తి ఇలా నిఘా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించాల్సి ఉంది.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ సంజయ్ కరోల్

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోలా ఆనంద్‌కు సన్మానం



శ్రీకాళహస్తి/ రేణిగుంట ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన కోలా ఆనంద్‌ను శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు బీడీ బాలాజీ, గోపి, రవి ఆచారి, యతీంద్రరెడ్డి, మధుకర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రేమ్, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువైన అంకాలమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌రావు, సత్యనారాయణ రావు, కార్తీక్‌రావు, బాబ్జీరావు, డాక్టర్ కృపానిధి, లోకేష్‌యాదవ్, అరుణ్, శివప్రసాద్, దినకర్, రామారెడ్డి, గోపి, మురళిజాదవ్, వెంకటసుబ్బయ్య, రష్మిత, కుమారి, సుబ్రాయకామత్, చక్రధర్, రాహుల్, అడపా శివకుమార్, క్రాంతికుమార్, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, గణేష్‌బాబు, వినీత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు



శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం గుండా వెళ్లే చెంబేడు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం తొలగించారు. చెంబేడు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి నీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో పరిసరప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌కు సూచించారు. దీంతో శనివారం హిటాచీల సాయంతో వ్యర్థాలను తొలగించే పనులు ప్రారంభించారు. ఈ పనులను కమిషనర్ భవానీ ప్రసాద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ పర్యవేక్షించారు.

రోడ్డుపై చెత్త వేయకండి



ఏర్పేడులో ర్యాలీ చేస్తున్న అధికారులు

ఏర్పేడు, ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): రోడ్లపై చెత్త వేసి పర్యావరణాన్ని పాడు చేయవద్దని ఎంపీడీవో సౌభాగ్యం సూచించారు. ఏర్పేడు మండల కేంద్రం, ఆమందూరు పంచాయతీలలో స్వచ్ఛభారత్‌పై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులతో కలిసి ఆమె ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, డిప్యూటీ ఎంపీడీవో రమణ కుమార్, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

ఏర్పేడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో పలు పాఠశాలల్లో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు చీమల బత్తెయ్య శనివారం మృతి చెందాడు. పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, బంధువులు, ప్రముఖులు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు.



బత్తెయ్య (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి సత్యవేడు

రేపు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ఏర్పేడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్‌కార్డులు సోమవారం నుంచి మండలంలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు భార్గవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 'రుతుపవనాలు ప్రభావ పరిశుభ్రత' అనే కార్యక్రమంపై శనివారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కుమార్, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రధానోపాధ్యాయరాలు వాణి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం మొక్కలను నాటి వాటి పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, జగన్నాథం, మాధవీలత, సుజన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మండల స్థాయి అధికారులతో కలసి మండల కేంద్రంలోని పురవీధులలో శనివారం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో - 2 మునిసుబ్రమణ్యం, ప్రధానోధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీలగలు, నవధాన్యాల పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం ఇలగనూరు సచివాలయంలో శనివారం రైతులకు 50శాతం సబ్సిడీతో జీలగలు, నవధాన్యాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి మురళీనాయుడు, మాజీ సర్పంచ్ మధునాయుడు, వ్యవసాయ సహాయాధికారులు పవన్, ఇనయతుల్లా, రైతులు, నాగూరు, కుమారస్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాసుపుస్తకాల్లో తప్పులుంటే సవరిస్తాం

పిచ్చాటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అందని రైతులకు వారి పాస్ పుస్తకాలలో, ఆధార్ కార్డులలో తప్పులు కారణమని కార్యాలయనికి వచ్చి సరిదిద్దుకోవచ్చని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

బోనుపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం బోనుపల్లి పాఠశాలలో శనివారం శ్రీకాళహస్తికి చెందిన శుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న భక్తకన్నప్ప కంటి ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ట్రస్టు కో-ఆర్డినేటర్ దొరకుమార్, వైద్యులు జయచంద్రప్ప, నర్సులు నందిని, భవాని, ప్రధానోపాధ్యాయురాలు భారతి, గ్రామపెద్దలు రామానాయుడు, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవం

పిచ్చాటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో కొలువైన వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకురాలు మేరమ్మ తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

వరదయ్యపాళెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.948.49 లక్షలు పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. ఎస్ఆర్‌పీ లోకేశ్ ఆధ్వర్యంలో 13 మంది డీఆర్‌పీల బృందం మండల కార్యాలయానికి చేరుకున్నట్లు ఏపీవో గణేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

బురదమయంగా గ్రామీణ వీధులు





రంగయ్యగుంటలో రోడ్డు పరిస్థితి- బక్కపోతులగుంటరోడ్డు బురదమయం

కేవీబీపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రోడ్లు, వీధులు బురదమయంగా మారాయి. ప్రజలు నడవటానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు బురదలో నడవాలంటే బాధపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లోని ప్రధాన వీధులను మాత్రమే సీసీరోడ్లుగా మార్పు చేశారు. మిగిలిన వీధులు బురదమయంగా మిగిలిపోయాయి. కొత్తూరులో అన్ని వీధులు బురదమయంగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అయినా వీధులను సీసీరోడ్లుగా మార్చాలని కోరుతున్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అవసరమైన చోట అదనపు పోలింగ్ కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ

సత్యవేడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా 1200 ఓట్లు దాటితే మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని డీటీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం లో డీటీ ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల నమోదు, జాబితా సవరణ, తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ పోలింగ్ బూత్ ఏజెంట్లకు సంబంధించిన వివరాలను అందించాలని కోరారు. పలువురు నాయకులు పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను డీటీ దృష్టికి తీసుకొచ్చారు.

ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేట్టాలని వినతి



ఎంపీడీవోకు విన్నవిస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మకు గ్రామస్తులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి - తడ రోడ్డు నుంచి ఆలత్తూరు వరకు రోడ్డు పూర్తి స్థాయిలో గుంతలు ఏర్పడి ప్రయాణించడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఐదేళ్ల నుంచి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఈ రోడ్డులో టిప్పర్లు అధిక లోడ్లతో మెటల్‌ను రోజు పదుల సంఖ్యలో తీసుకుపోవడం వలన రోడ్డు దారుణంగా మారిందన్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసును రద్దు చేశారని తెలిపారు. రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి చూపాలి



విద్యార్థులకు ప్రదానం చేస్తున్న అతిథులు

రేణిగుంట ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఫిజికల్ సైన్స్ ఫోరం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాలల్లోని ప్లస్ టు విద్యార్థినిలకు విశ్వం పుట్టుక భారతదేశ అంతరిక్ష పురోగతిపై ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు మెమెంటోలు, ప్రశంస పత్రాలను బహూకరించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు మోహన్ నాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణ, హెచ్ఎం గురప్ప, ఉపాధ్యాయులు దీపిక, రాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించండి

తహసీల్దార్‌కు సూచించిన ఎమ్మెల్యే బొజ్జల



రేణిగుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రేణిగుంటలో స్కూటర్ మెకానిక్‌ల కమ్యూనిటీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని తహసీల్దారు చంద్రశేఖరరెడ్డిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించారు. అలాగే ఇంటి స్థలాలు ఇవ్వాలని సూచించారు. శనివారం స్కూటర్ మెకానిక్‌లు శనివారం ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉరేసుకుని ఫొటోగ్రాఫర్ మృతి



మృతిచెందిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రేణిగుంట ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఉరివేసుకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక వివేకానంద కాలనీలో చోటు చేసు కుంది. గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. కే.రాజు (23) తిరుమలలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ ఉంటాడు. శని వారం ఉదయం ఇంట్లోకి వెళ్లి ఉరి వేసు కున్నాడు. ఇంటిబయట ఫోన్‌లో మాట్లాడుతూ ఉన్న తమ్ముడు గుర్తించాడు. తలుపులు పగలగొట్టి అన్నను బంధువుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రూయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



ర్యాలీ చేస్తున్న ప్రజలు, నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచు కుందామని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో పట్టణ మాడ వీధుల్లో ప్రజలతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రజలు కాలువల్లో చెత్తను వేయకుండా చెత్తబుట్టలోని పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలకసంఘ కమిషనర్ భవానీ ప్రసాద్, నాయకులు కాసరం రమేష్, పురపాలక సంఘ అధికారులు, శానిటరీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రేణిగుంట ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మించిన నాలుగు షెడ్లను రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. శనివారం పాత విమానాశ్రయం రోడ్డులో నూతనంగా నిర్మించిన మూడు షెడ్లను తొలగించే సమయంలో కొంతమంది ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌ను నిర్బంధించారు. రెవెన్యూ సిబ్బంది వెళ్లే సరికి వారు వెళ్లిపోయారు. అలాగే కొత్తపాలెం గ్రామంలోని వంక పోరంబోకులో నిర్మించిన మరో షెడ్డను కూల్చివేశారు.

5లోపు అభ్యంతరాలు తెలపాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని రాజీవ్ నగర్‌లో టిడ్కో ఇళ్లు పొందిన 175మంది లబ్ధిదారులకు నోటీసులు అందజేసినట్లు కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాంకు నుంచి రుణం తీసుకు నేందుకు లబ్ధిదారులు నిరాకరించడంతో వారు ప్రభుత్వానికి సొంతంగా, లోన్ ద్వారా చెల్లించాలని నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. మరో 110 మంది నోటీసులు స్వీకరించలేదని అందువల్ల వారి ప్లాట్లు రద్దుచేసి కొత్తవారికి ఇవ్వాల్సి ఉందని తెలియజేశారు. వివరాలను ఆయా సచివాల యాల పరిధిలోని నోటీసు బోర్డులో పొందుపరచినట్లు పేర్కొన్నారు. దీనిపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబరు 5వ తేదీ సాయంత్రం 4గంటలలోగా లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.